చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, మార్చి 28: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఓం సాయి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెల్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, అసోసియేషన్ బాధ్యుడు పాండవుల చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి/ చంద్రుగొండ, మార్చి 28: మండలంలోని ఎర్రగుంటలో ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠను గురువారం అర్చకులు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రుగొండ మండలం బాలియతండాలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయ ప్రతిష్ఠాపనలో కూడా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

జగదాంబ అమ్మవారికి 'కోనేరు' ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు కోనేరు చిన్ని, తదితరులు

కొత్తగూడెం టౌన్, మార్చి 28: జిల్లాలోని సుజాతనగర్ మండలం సీతంపేటబంజర పంచాయతీలో శ్రీ జగదాంబ మాతా, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సీతంపేటబంజర గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనను సన్మానించారు.

జగన్నాథపురంలో సామూహిక సహస్రగళార్చన

పాల్వంచ రూరల్, మార్చి 28: మండలంలోని జగన్నాథపురంలో సౌందర్యలహరి సామూహిక సహస్రగళార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. జనహిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బేర లక్ష్మి (కోలాటం లక్ష్మి) ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ సామూహిక గళార్చనకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 340 మంది మహిళలు హాజరై సహస్రపారాయణం చేశారు.

వైభవంగా చక్రస్నానం

అన్నపురెడ్డిపల్లి, మార్చి 28: స్థానిక బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి చక్రస్నానాన్ని యజ్ఞాచార్యులు గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. గురువారం బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా చతుస్థానార్చన, నిత్య హవనం, పూర్ణాహుతి, మహా కుంభప్రోక్షణ, పుష్పయాగం, ద్వాదశారాధనలు, ధ్వజ అవరోహణం, శృంగార డోలోత్సవం, అర్చక పం డిత సత్కారం నిర్వహించారు.

ద్వారకా తిరుమలకు భక్తుల పాదయాత్ర

అశ్వారావుపేట, మార్చి 28: మండలంలోని నారాయణపురం పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ చిన్నంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో భక్తులు గురువారం ఏపీలోని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం సీతారాములకు నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

అన్నదానానికి రూ.2లక్షలు

భద్రాచలం, మార్చి 28: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి స్థానిక తాత గుడి సెంటర్‌కు చెందిన గొండెల వెంకటేశ్వరరావు, తన సతీమణి రత్నకుమారి జ్ఞాపకార్థం గురువారం రూ. 2లక్షలు విరాళంగా ఇచ్చారు. దేవస్థానం అధికారి లింగాల సాయిబాబా నుంచి రసీదు అందుకున్నారు. ఉ

మణుగూరు బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మణుగూరు టౌన్, మార్చి 28: మణుగూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీకి ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్ష పదవికి పోటీ పడిన నలుగురిలో ఇద్దరికి సమాన ఓట్లు వచ్చాయి. వీరిద్దరూ చెరొక ఆరు నెలలపాటు అధ్యక్ష పదవిలో ఉంటారని ఎన్నికల అధికారి జీవరత్నం తెలిపారు. మొదటి ఆరు నెలలపాటు చిర్రా రవికుమార్, తర్వాతి ఆరు నెలలపాటు మేదరమెట్ల శ్రీనివాస్ అధ్యక్షులుగా ఉంటారు. జనరల్ సెక్రెటరీగా దాసరి కవిత గెలుపొందారు.

సైబర్ నేరం.. దుబాయ్ కేంద్రం

- అరబ్ దేశంలో ఉంటున్న ఇద్దరు తెలుగు వ్యక్తుల పన్నాగం
- క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులంటూ హైదరాబాద్ వ్యాపారులకు కాల్స్
- మరోవైపు ఇల్లెందు డ్వాక్రా మహిళల పేరుతో ఖమ్మంలో బ్యాంకు ఖాతాలు
- 'వాట్సప్' పోస్టులతో మహిళల ఖాతాల్లో నగదు జమ చేసిన వ్యాపారులు
- మహిళల ఖాతాల నెట్‌బ్యాంకింగ్‌తో నేరుగా దుబాయ్‌కి నగదు మళ్లింపు
- పెట్టుబడులు రాక మోసపోయిన వ్యాపారులు.. సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదులు..
- ఖాతాల వివరాల విచారణతో వెలుగులోకి వచ్చిన నేరాల మూలాలు

కొత్తగూడెం క్రైం, మార్చి 28: దుబాయ్ కేంద్రంగా సైబర్ నేరం జరిగింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన పలువురు వ్యాపారులు, భద్రాద్రి జిల్లా ఇల్లెందుకు చెందిన ఐదుగురు డ్వాక్రా మహిళ మోసపోయారు. వ్యాపారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం.. వారు బ్యాంకు ఖాతాల వివరాలపై ఆరా తీయడం వంటి ఘటన నేపథ్యంలో దుబాయ్ కేంద్రంగా సాగిన ఈ ఘటన వివరాలు వెలుగులోకి వచ్చాయి. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు కథనం ప్రకారం..

ఖమ్మానికి చెందిన అడ్వకేట్ సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన అశోక్ గుప్తా స్నేహితులు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వీరిపై హైదరాబాద్‌లో కేసులు నమోదు కావడంతో దుబాయ్ వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నారు. అక్కడ మరో ప్లాన్ వేశారు. దాని ప్రకారం సుధాకర్ ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు లోని తన బావమరిది కస్యా చినబాబు అలియస్ హర్షకు ఫోన్ చేశాడు. ట్రేడింగ్ చేసేందుకు ఇండియాలో ఒక బ్యాంక్ ఖాతా కావాలని అడిగాడు. అందుకు రూ.50 వేలు ఇస్తానని చెప్పాడు. అత్యాశకు పోయిన హర్ష తన భార్య ప్రియాంక పేరుతో ఓ బ్యాంకు ఖాతా తెరిచి ఇచ్చాడు. చెప్పినట్లుగా సుధాకర్ అతడికి రూ.50 వేలు పంపాడు. అనంతరం కొంతకాలానికి అశోక్‌గుప్తా కూడా హర్షకు ఫోన్ చేసి మరిన్ని బ్యాంకు ఖాతాలు కావాలని అడిగాడు. మరింత డబ్బు ఇస్తానని ఆశచూపించాడు. దీంతో హర్ష భార్య ప్రియాంక.. తన స్నేహితుడైన ఇల్లెందుకు చెందిన చైతన్యకి ఈ విషయం తెలిపింది. దీంతో చైతన్య కూడా ఇల్లెందులో తనకు తెలిసిన ఐదుగురు డ్వాక్రా మహిళలను సంప్రదించాడు. ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున రుణం ఇప్పిస్తానని, అందుకోసం ఖమ్మం గాంధీచౌక్ బ్యాంకులో ఖాతాలు తెరవాలని చెప్పాడు. ఒకరోజు వారిని ఖమ్మం తీసుకొచ్చి ఖాతాలు తెరిపించాడు. ఆ ఖాతాలకు సుధాకర్, అశోక్‌గుప్తాల ఫోన్ నెంబర్లు లింక్ చేయించాడు. అలాగే, ఆయా ఖాతాల నెంబర్లు, నెట్ బ్యాంకింగ్ వివరాలను హర్ష ద్వారా సుధాకర్, అశోక్‌గుప్తాలకు పంపించాడు. తరువాత సుధాకర్, అశోక్‌గుప్తాలు చైతన్యకు రూ.లక్ష నగదును పంపారు. దీంతో లోన్ వచ్చిందంటూ చైతన్య వెళ్లి ఒక్కో మహిళకు రూ.15 వేల చొప్పున ఇచ్చాడు. మిగిలిన రూ.25 వేలు తాను తీసుకున్నాడు.

సైబర్ మోసం వెలుగు చూసిందిలా..

అశోక్‌గుప్తా, సుధాకర్‌లు హైదరాబాద్‌లోని పలువురు వ్యాపారులతో కలిపి ఓ వాట్సప్ గ్రూపు క్రియేట్ చేశారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక మొత్తం కలిపి ఇస్తామని నమ్మబలికారు. దీనికి కొందరు వ్యాపారులు అంగీకరించడంతో వారితో ఈ డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేయించారు. అనంతరం ఈ ఖాతాల్లోని నగదును వాళ్లు దుబాయ్‌కి బదిలీ చేసుకొని అక్కడ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. కొంతకాలంగా బిట్‌కాయిన్ల నగదును వ్యాపారులకు సక్రమంగా పంపడం లేదు. దీంతో తాము మోసపోయిన గుర్తించిన వ్యాపారులు.. సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు ఈ బ్యాంకు ఖాతాలపై ఆరా తీశారు. అవి ఇల్లెందు మహిళలవని తేలాయి. అనంతరం పోలీసుల విచారణలో చైతన్య, హర్ష, ప్రియాంక పేర్లు వెలుగు చూశాయి. దీంతో చైతన్య, హర్ష, ప్రియాంకలను భద్రాద్రి పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

మావోయిస్టు పార్టీ డిప్యూటీ కమాండర్, కొరియర్ అరెస్ట్

వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, మార్చి 28: మావోయిస్టు పార్టీలో కీలకంగా పని చేస్తున్న డిప్యూటీ కమాండర్‌తో పాటు ఓ పార్టీ కొరియర్‌ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. దుమ్ముగూడెం పోలీసులు, సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్, కోబ్రా 204 బెటాలియన్ భద్రతా దళాలు సంయుక్తంగా ములకనపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం కూంబింగ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో పరారవుతున్న ఇద్దరు వ్యక్తులను జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరిని విచారించి ఒకరిని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూస్నార్ గ్రామానికి చెందిన పుట్టం మున్నా అలియాస్ సన్నాల్‌గా గుర్తించారు. మున్నా ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కిష్టారం ఎల్వోఎస్ డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. మున్నా 2004లో మావోయిస్టు పార్టీలో చేరాడు. దళ సభ్యుడి నుంచి పార్టీలో డిప్యూటీ కమాండర్ స్థాయికి ఎదిగాడు. మున్నాకు అనేక విధ్వంసకర ఘటనలతో ప్రమేయం ఉన్నది. మున్నా తలపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డు ప్రకటించింది. పట్టుబడిన మరో వ్యక్తిని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరాపురం గ్రామానికి జాడి పెద్దబ్బాయిగా గుర్తించారు. పెద్దబ్బాయి మూడు సంవత్సరాల నుంచి మావోయిస్టు పార్టీకి కొరియర్‌గా పనిచేస్తున్నాడు. నిందితులిద్దరి నుంచి జవాన్లు పది జిలిటిన్ స్టిక్స్, రెండు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, మావోయిస్టుల కరపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

పకడ్బందీగా నవమి పనులు: ఆర్డీవో

మాట్లాడుతున్న భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు

భద్రాచలం, మార్చి 28 : శ్రీరామ నవమి సందర్భంగా తమకు అప్పగించిన పనులను సంబంధిత అధికారులు పకడ్బందీగా చేపట్టాలని, రామయ్య కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీరామ నవమి ఏర్పాట్లపై గురువారం ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాటాడారు. స్వామి వారి కల్యాణం జరిగే మిథిలా స్టేడియంలో కల్యాణ మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించామని, ప్రతి సెక్టార్‌లో ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా భక్తులు లాడ్జీలు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించామని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు పట్టణాన్ని 25 జోన్లుగా విభజించి అధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. తాగునీరు, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గోదావరిలో లోతు తెలిపేలా హెచ్చరిక బోర్డులతోపాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 20 బెడ్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రామయ్య తలంబ్రాల కోసం గతంలో కంటే ఎక్కువ కేంద్రాలను ఏర్పాటు చేయాలని దేవస్థానం ఈవోను ఆదేశించారు. భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీపీఆర్వోను ఆదేశించారు. సమావేశంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే కూనంనేని

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి, మార్చి 28: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రుద్రంపూర్‌లో నిర్వహించిన చాలెంజర్స్ క్రికెట్ ట్రోఫీలో విజేతలకు గురువారం ఆయన బహుమతులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కాగా, రెండు వారాలుగా జరుగుతున్న ఈ క్రికెట్ పోటీల్లో రామవరం సాధన టీం, భద్రాచలం టీం ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ క్రికెట్ పోటీలను ఖమ్మం జిల్లా క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, నిర్వాహకులు షాబీర్‌పాషా, తోట రాజు, సలిగంటి శ్రీనివాస్, సురేశ్, వీరస్వామి పాల్గొన్నారు. క్రీడాకారులకు జిల్లా క్రికెట్ అసోషియేషన్ ప్రెసిడెంట్ చేకూరి వెంకట్ అభినందనలు తెలిపారు.

అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యమందించాలి

సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ సుజాత

కొత్తగూడెం సింగరేణి, మార్చి 28: అత్యవసర చికిత్స అంశాలపై మంచి అవగాహన పెంపొందించుకొని అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత సూచించారు. ఏ విధమైనా సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని అన్నారు. అత్యవసర చికిత్సఅయిన బీఎల్ఎస్ (బేసిక్ లైఫ్ సపోర్టు), ఏఎల్‌సీఎస్ (అడ్వాన్స్ ట్రామా లైఫ్ సపోర్టు), సీపీఆర్ (కార్డియో పల్మనరీ రేశస్టేటింగ్)లపై అవగాహన కల్పించడం కోసం కొత్తగూడెం రీజియన్‌లోని కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియా సింగరేణి ఆస్పత్రుల వైద్యులు, స్టాఫ్ నర్సులు, వార్డు అసిస్టెంట్‌లకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. సీఎండీ బలరాం ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఆస్పత్రుల్లోని యంత్రాంగానికి అత్యవసర సమయాల్లో అందించాల్సిన వైద్యం గురించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రామగుండం, భూపాలపల్లి, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రుల్లో అన్ని ఏరియాల డిస్పెన్సరీ, ఏరియా ఆస్పత్రుల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించుకున్నామన్నారు. ఈఎంఆర్ఐ డాక్టర్లు రవీన్, జావీద్, సతీశ్, మధుసూధన్, డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, వార్డు అసిస్టెంట్‌లు, సీనియర్ పీవో ఎం.శ్రీనివాస్, సింగరేణి ప్రధాన ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్ జీవీకే ఫౌండేషన్ ఈఎంఆర్ఐ వైద్యులతో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శిక్షణ తరగతులను జీఎంహెచ్ఆర్‌డీ వెంకటేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్‌సుజాత, విక్టర్ వందనం, మాట్రోన్ మిస్ శాలే ప్రారంభించారు.

'మానవాళి కోసం అవతరించిన గ్రంథమే ఖురాన్'

రామవరం, మార్చి 28: ఖురాన్ అవతరించిన మాసమే రంజాన్ మాసం అని జమాతే ఇస్లామీహింద్ రుద్రంపూర్ శాఖ అధ్యక్షుడు అబ్దుల్ బాసిత్ పేర్కొన్నారు. మానవులందరి కోసం అవతరించిన గ్రంథం ఖురాన్ అని స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో ఖురాన్ పారాయణం పూర్తి చేసిన సందర్భంగా రుద్రంపూర్‌లో కులమతాలకు అతీతంగా గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన దివ్యోపదేశం చేశారు. రంజాన్ ఉపవాసాలు మనిషుల్లో మంచి మానవతా విలువలు పెంపొందిస్తాయని అన్నారు. సమాజంలో శాంతి సామరస్యం వెల్లివిరిసేలా చేస్తాయని అన్నారు.

15న భద్రాద్రిలో స్వరాభిషేకం, నృత్యాభిషేకం

భద్రాచలం, మార్చి 28: స్థానిక మిథిలా స్టేడియం ఎదురుగాగల ఉత్తర ద్వారం వద్ద ఏప్రిల్ 15న స్వరాభిషేకం, నృత్యాభిషేకం నిర్వహించనున్నట్లు అవార్డీ టీచర్స్ అసోసియేషన్(ఆటా) అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గాయకులు భక్త రామదాసు కీర్తనలను ఆలపిస్తారని, నృత్యకారులు నర్తిస్తారని పేర్కొన్నారు. ముందుగా నమోదు చేసుకున్న 500 మందికి సర్టిఫికెట్లు, భోజన ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. వసతి ఏర్పాటును ఎవరిది వారే చూసుకోవాలని స్పష్టం చేశారు. పేర్ల నమోదుకు ఏప్రిల్ 5 వరకు మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు. పేర్ల నమోదుకు, మరిన్ని వివరాలకు 98483 51370, 93969 82375 సెల్ నంబర్లకు వాట్సాప్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

'ఆకాశవాణిలో సుజాత సేవలు అభినందనీయం'

ఇంజినీర్ సుజాతను సన్మానిస్తున్న ఆకాశవాణి ఉద్యోగులు

రామవరం, మార్చి 28: ఆకాశవాణిలో ఇంజినీర్‌గా సుజాత అందించిన సేవలు అభినందనీయమని పలువురు ఆలిండియా రేడియో అధికారులు ప్రశంసించారు. కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో సీనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ చేస్తున్న ఆర్.సుజాతకు గురువారం ఉద్యోగులంతా కలిసి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఆలిండియా రేడియో స్టేషన్ ఇంజినీరింగ్ విభాగంలో సుజాత అందించిన సేవలు మరువలేనివని అన్నారు. బైరి శ్రీనివాసన్, రెడ్డి, ప్రభాకర్‌రావు, బాబుసింగ్, ఆనందరావు, సుమన్, సుదర్శన్, సుగ్రీవ, కోటేశ్వరరావు, విజయ్‌కుమార్, శంకర్‌రావు, బొల్లవరపు ప్రసాద్, శనగ స్వామి, నర్సయ్య, రేడియో జాకీలు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

అవగాహన సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పాల్వంచ, మార్చి 28: స్థానిక పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై ఒకరోజు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ప్రాజెక్టు మేనేజర్ బాలు ప్రవరాఖ్య మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి, తమ కెరీర్ గురించి మరిన్ని విషయాలు తెలుసుకుంటుకు ఇలాంటి కెరీర్ గైడెన్స్ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కళాశాల సెక్రటరీ భరత్‌కృష్ణ, డైరెక్టర్ అవని, ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అశ్వారావుపేట రూరల్, మార్చి 28: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని ఆసుపాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి, ఎంపీవో సీతారామరాజు అధ్యక్షతన జరిగిన పీసా గ్రామసభలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోతీలాల్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు లోహిత

ఇల్లెందు రూరల్, మార్చి 28: బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యురాలు లోహిత అన్నారు. గురువారం మండలంలోని కొమరారం పీహెచ్‌సీలో 30మంది బాలింతలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య రక్షణపై సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గురువారం బాలింతలకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.98 లక్షల నగదు పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, మార్చి 28: మండలంలోని పెంట్లం ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద రూ.1.98 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గురువారం రాత్రి సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వెళ్తున్న కారును తనిఖీ చేసి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.98 లక్షల నగదును సీజ్ చేశామన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

టేకులపల్లి, మార్చి 28: చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తావుర్యతండా పరిధి స్టేషన్ తడికలపూడి గ్రామానికి చెందిన ఉప్పల సుధాకర్ సృజన రెండో కుమారుడు ఉప్పల దేవాస్(3) రెండు రోజుల క్రితం జ్వరం వచ్చి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందాడు.

ఆటో బోల్తా. నలుగురికి గాయాలు

బూర్గంపహాడ్, మార్చి 28: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. బూర్గంపహాడ్ సమీపంలోని ఆంధ్రా సరిహద్దున ఉన్న వేలేరు ప్రాంతంలో అటు నుంచి వస్తున్న ట్రాలీ ఆటో గురువారం అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు బూర్గంపహాడ్ సీహెచ్‌సీకి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

108లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

టేకులపల్లి, మార్చి 28: 108 వాహనంలో గర్భిణికి సుఖ ప్రసవం చేసిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బద్దుతండాకు చెందిన డీ అలివేలు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి గర్భిణిని సులానగర్ పీహెచ్‌సీకి తరలించే క్రమంలో మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ జీరాధా, ఆశ వర్కర్ మంగ సహాయంతో ప్రసవం జరిపించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని అక్కడి నుంచి సులానగర్ పీహెచ్‌సీకి తరలించామన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

పినపాక, మార్చి 28: ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీవో రామకృష్ణ గురువారం స్థానిక రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, టీఏ, మేట్లతో సమీక్షించారు. పనులను పర్యవేక్షించకపోతే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చినరావిగూడెంలో వైద్య శిబిరం

మణుగూరు టౌన్, మార్చి 28: మణుగూరు మున్సిపాలిటీలోని చినరావిగూడెం గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని మణుగూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ నిర్వహించారు. రాజీవ్‌గాంధీ నగర్‌లోని బీసీ బాలుర వసతి గృహంలోనూ వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, వెంకటలక్ష్మి, హిమబిందు, రవి తదితరులు పాల్గొన్నారు.

నాయకుల కాలనీలో..

చర్ల, మార్చి 28: మండలంలోని నాయకుల కాలనీలో గురువారం చర్ల (కొయ్యూరు) పీహెచ్‌సీ డాక్టర్ శ్రీధర్ వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితులను పరీక్షించి మందులు ఇచ్చారు. సీజనల్‌గా వచ్చే జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శిరీష, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ఆళ్లపల్లి, మార్చి 28: మండలంలోని పశువులకు గాల